క్లుప్తంగా

బిల్డింగ్‌పై నుంచి పడి బాలుడి మృతి

ధర్మసాగర్ : బిల్డింగ్‌పై నుంచి పడి బాలుడు మృతిచెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జానీపాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకనపల్లి రంజిత్‌కుమార్ చిన్న కుమారుడు సాత్విక్ (12) బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఇంటి దగ్గరలోని కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగ్‌పై ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలుజారి లిఫ్ట్‌కు సంబంధించిన గాలలో పడ్డాడు. అందులో నీరు ఉండడంతో మునిగిపోగా గమనించిన మరో బాలుడు సాత్విక్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో సాత్విక్‌ను బయటికి తీసి హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి రంజిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మసాగర్ : మండల కేంద్రంలో పేకాడుతున్న ఆరుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై జానీ పాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గాజ మురళి, ముప్పారపు రజనీకాంత్, మొగిలిచర్ల రమేష్, యాట శ్రీనివాస్, మేడబోయిన పరుశురామ్, ల్యాగ నవీన్, మరో ఇద్దరు పేకాడుతున్నారనే సమాచారం అందిందన్నారు. దీంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారని నుంచి రూ.11,660 నగదు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు గాజ వెంకటేశ్, సురుగురి కమలాకర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై నరసింహారావు, పోలీస్ సిబ్బంది నరేశ్, సాయినాథ్, దామోదర్, వేణు, పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెం రేణుకా ఎ ల్లమ్మ దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి తిరుపతి, గౌడ సంఘం అధ్యక్షుడు బండారి రాజు, గీత కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని దుండగులు ఆలయ తాళాలు ధ్వంసం చేసి చొరబడి హుండీని పగులగొట్టి సుమారు రూ.5 వేల నగదుతో పాటు కట్న, కానుకలు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఎల్లమ్మకు అలంకరించిన ఆభరణాల చోరీకి సైతం యత్నించారని, అవి రోల్డ్‌గోల్డ్ అని గుర్తించి వాటిని అక్కడే వదిలేసి పోయారని చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి తిరుపతి, గౌడ సంఘం అధ్యక్షుడు బండారి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఆలయ తాళం పగలగొట్టి, లోపల హుండీని ధ్వంసం చేసి హుండీలోని వెయ్యి రుపాయలు దొంగిలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తిచెంది మహిళ ఆత్మహత్య



బచ్చు లక్ష్మి (ఫైల్)

ఎల్కతుర్తి : ఇల్లు నిర్మాణం కోసం చేసిన అప్పు భారం.. మద్యానికి బానిసైన భర్త.. పిల్లల భవిష్యత్ ఎంటో తెలియని పరిస్థితి.. మద్యం మానేయాలని వారించిన వినని భర్త.. ఆ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన మహిళ డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన బచ్చు లక్ష్మి (48)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త బచ్చు రామారావు ఐదేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు కట్టాడు. తీసుకున్న అప్పుకు వడ్డీ పెరుగడంతో తనకున్న 4 ఎకరాల భూమి అమ్మి అప్పు తీర్చాడు. ఈ క్రమంలో రామారావు మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని భార్య లక్ష్మి ఎంత చెప్పిన వినలేదు. దీంతో పిల్లలకు ఆస్తులు ఏమిలేకుండా చేశాడని, తాగుడు మానడం లేదని జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి ఈనెల 4న ఇంట్లో ఉన్న డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి పెద్ద కుమారుడు రోహిత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల్లో సివిల్ ఆస్పత్రి

- వేధిస్తున్న కరెంట్ సమస్య
- మూలనపడ్డ జనరేటర్
- నీటి సరఫరాలో అంతరాయం
- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



విద్యుత్ లేకపోవడంతో చీకటి గదుల్లో ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్య సిబ్బంది

పరకాల : ప్రతీరోజు వందల మంది రోగులకు చికిత్స అందించే పరకాల సివిల్ ఆస్పత్రికి సౌకర్యాల, కనీస సదుపాయాల సమస్య వెంటాడుతోంది. పనిచేయని జనరేటర్.. ఎలక్ట్రిషియన్ స్థానికేతరుడు కావడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే పట్టణంలోని సివిల్ ఆసుపత్రి అంధకారంలో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. నీటి సరఫరా సక్రమంగా లేని కారణంగా రోగులు ఒంటికి, రెంటికి బిగపట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. డివిజన్ కేంద్రంలోని ఆరు మండలాల ప్రజలతో పాటు పొరుగు జిల్లా ప్రజలకు ఈ సివిల్ ఆసుపత్రి పెద్ద దిక్కుగా ఉండగా ఆస్పత్రికి కష్టాలు వస్తే చెప్పుకోవడానికి దిక్కు లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో 30 పడకల ఆసుపత్రికి ప్రస్తుతం పాత భవనం (ప్రసూతి భవనం) గత్యంతరంగా మారింది. అదే భవనంలోనే ప్రసూతి రోగులతో పాటు ఇన్ పెషెంట్లు ఉంటున్నారు. ఇప్పటికే అరకొర గదులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు విద్యుత్ సరఫరా పెద్ద సమస్యగా మారింది. విద్యుత్ లేని సమయంలో ఉపయోగపడాల్సిన జనరేటర్ పనిచేయకపోవడంతో రోగులు వార్డుల్లో, చీకటి గదుల్లో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఫ్యాన్‌లు తిరుగకపోవడం, వెలుతురు లేని గదులు, మరుగుదొడ్లలో నీళ్లు రాకపోవడంతో రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద రోగులకు పెద్ద దిక్కుగా ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా ఉన్నతాధికారులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా ఆస్పత్రిలో ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే స్థానిక ఎలక్ట్రిషన్ ద్వారా మరమ్మతులు చేయించేవారు. కానీ కొంత కాలంగా ఎలక్ట్రిషన్ జిల్లా కేంద్రం నుంచి వస్తనే విద్యుత్ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉందని, అప్పటి వరకు చీకటి గదుల్లో, ఊపిరి ఆడలేని స్థితిలో రోగులు, బాలింతలు, పసికందులు బిక్కుబిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు పేషెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయించాలి

ప్రతిరోజు వందలమంది రోగులతో రద్దీగా ఉండే సివిల్ ఆస్పత్రిలో విద్యుత్ సమస్య ఉండటం బాధాకరం. జనరేటర్‌ను అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

-బొచ్చు చిన్ని కృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు

చర్యలు చేపడుతాం

సివిల్ ఆసుపత్రి భవనం పాతది కావడంతో విద్యుత్ సరఫరాలలో కొంత సమస్య నెలకొంది. జనరేటర్ మరమ్మతుకు చర్యలు చేపట్టాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

-గౌతమ్ చౌహాన్, సూపరింటెండెంట్

బడిబాటను విజయవంతం చేయాలి

కమలాపూర్ : ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను విజయవంతం చేయాలని ఎంఈఓ కె.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. బడిబాటలో భాగంగా ఈనెల 6న అన్ని గ్రామాల్లో బడిబాట గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభలో అన్ని హ్యాబిటేషన్లకు సంబంధించిన అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, విలేజ్ ఆర్గనైజర్లు, విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు, విద్యావేత్తలు, పాఠశాల పూర్వ విద్యార్థులు హాజరై గ్రామంలోని ప్రతి విద్యార్థి, తల్లిదండ్రులు గ్రామసభకు హాజరయ్యేలా చూడటంతో పాటు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా అవగాహన కల్పించాలని కోరారు.

హెల్త్ సెంటర్ పనుల పరిశీలన

పరకాల : పట్టణంలోని సివిల్ ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ పనులను మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ వెంకటేశ్ గురువారం పరిశీలించారు. పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



వేలేరు : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ రమేశ్ రాథోడ్, అధికారులు



శాయంపేట : దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వేలేరు : భూ భారతి సదస్సులతో రైతుల భూ సమస్యలు తీరుతాయని హనుమకొండ ఆర్డీఓ రమేశ్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని షోడాషపల్లి గ్రామంలో భూ భారతి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మొత్తం 33 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ సురేందర్, సీనియర్ అసిస్టెంట్ హేమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని వీరనారాయణపూర్ గ్రామంలో అధికారులు గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ రమేశ్ రాథోడ్ రెవెన్యూ సదస్సును సందర్శించారు. రైతుల అందించిన దరఖాస్తులను పరిశీలించారు. భూ భారతి ద్వారా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు భూమి హక్కులు కల్పించనున్నట్లు తెలిపారు. కాగా 114 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ భద్రు నాయక్, ఆర్ఐ సదానందం పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లిలో తహసీల్దార్ కల్వల సత్యనారాయణ గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారానికి 42 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

పరకాల : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి కోరారు. మండలంలోని నాగారం గ్రామంలో గురువారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సులో 118 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

అర్హులను ఎంపిక చేయాలి

కమలాపూర్ : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేయాలని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు గురువారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి అర్హుల ఎంపికలో పైరవీలు సరికాదని, అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగితే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు.

ఒకరి రిమాండ్

శాయంపేట : దొంగతనం కేసులో ఓ వ్యక్తి కోర్టుకు గైర్హాజరు అవుతున్న కారణంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. పరకాలకు చెందిన మోరె సాయికుమార్‌పై గతేడాది శాయంపేట పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసు నమోదు అయ్యింది. కాగా కొంత కాలం నుంచి కోర్టుకు గైర్హాజరు అవుతున్నాడు. సాయికుమార్‌పై పరకాల కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేయగా కోర్టు ఆదేశాల మేరకు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో సాయికుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన గజ్జెల లింగమూర్తిపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నేరేడుపల్లి గ్రామానికి చెందిన గజ్జెల లింగమూర్తి అదే గ్రామానికి చెందిన రేగూరి వెంకట్రామ్‌రెడ్డికి చెందిన వ్యవసాయ భూమి గత 4 సంవత్సరాల నుంచి కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో వెంకట్రామ్‌రెడ్డికి, భూమి పక్కనే ఉన్న పల్లె బుచ్చిమల్లయ్య మధ్య ఉన్న పొత్తుల గెట్టు హద్దుల విషయంలో కొన్ని రోజుల నుంచి తగాద నడుస్తోంది. ఇటీవల ఇరువురు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. వారు ఘర్షణ పడుతున్న సమయంలో భూమిని సాగు చేస్తున్నందున వెంకట్రామ్‌రెడ్డి సాక్ష్యంగా చూపించాడు. దీంతో గురువారం ఉదయం బుచ్చిమల్లయ్య అన్న కొడుకు పల్లె కోటి తన ఇంటి ముందు ఆపి దుర్భాషలాడుతూ కట్టెతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. దీంతో లింగమూర్తి ఫిర్యాదు మేరకు బుచ్చిమల్లయ్య, కోటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

మండలంలోని మైలారం గ్రామానికి చెందిన సిరిపురం రాజయ్యకు, నూనె తిరుపతికి భూమి హద్దుల విషయంలో జరిగిన గొడవ కారణంగా మనస్థాపం చెందిన నూనె తిరుపతి మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తిరుపతి భార్య సునిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సిరిపురం రాజయ్యతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత



యోగాపై అవగాహన కల్పిస్తున్న యునాని ఆస్పత్రి ఇన్‌స్ట్రక్టర్స్

పరకాల : యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పరకాల యునాని ఆస్పత్రి ఇన్‌స్ట్రక్టర్స్ భోగ రఘుపతి, అమూల్య సూచించారు. ఈనెల 21న యోగా దినోత్సవాన్ని సందర్భంగా పరకాల యూనాని ఆస్పత్రి ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో చిన్నారులకు, పెద్దలకు యోగా వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మానవులకు ఆరోగ్యం చాలా ముఖ్యమనే విషయాన్ని గమనించి ప్రతి రోజు గంట సమయం యోగా కోసం కేటాయించాలన్నారు. దేశంలో మళ్లీ కరోనా విస్తరిస్తున్న దృష్ట్యా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఉద్యోగులు, ఆశ వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి

కమలాపూర్ : మండలంలోని భీంపల్లికి చెందిన చింతల రమేశ్ (50) అనే గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. గతేడాది నవంబర్ 3న సాయంత్రం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాల పాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆచేతన స్థితిలోనే ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. గురువారం పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందినట్లు చెప్పారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత డాక్టర్ సురేశ్

నడికూడ : మండలంలోని రాయపర్తి రైతు వేదిక భవనంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత డాక్టర్ ఎం.సురేశ్ హాజరై పలు సూచనలు చేశారు. రైతులు చిరుధాన్యాలు, నూనె, పప్పు దినుసుల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. మిర్చి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి, డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ అధికారి మధులిక, సాయికిరణ్, ఏఈఓలు ప్రశాంత్, ప్రదీప్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడం ద్వారా వ్యాపారస్తులకు మంచి పేరు ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం హనుకొండలోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు అందించే విత్తనాలు, ఎరువుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. వ్యాపారస్తులకు తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శివాజీ, కోశాధికారి ఎర్ర లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రజాపాలకుడు ఛత్రపతి శివాజీ అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని లింగమడుగుపల్లిలో గురువారం ఆరె సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే హాజరై ఆవిష్కరించారు. శివాజీ ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఆరె సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకన్న, రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ, హంసరావు, నాయకులు రాజేశ్, శివాజీ, సందేరావు, రమేశ్, చందర్‌రావు, రాజేశ్వర్‌రావు, మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన సదుపాయాలు

- ఎంపీడీఓ అనిల్‌కుమార్



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

ధర్మసాగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సదుపాయాలు కల్పిస్తోందని ఎంపీడీఓ అనిల్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలామ్ టీచింగ్ లర్నింగ్ సెంటర్‌లో గురువారం బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ఉపాధ్యాయులు ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలన్నారు. అనంతరం పరిశీలకుడిగా హాజరైన కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా శాఖ జూన్ 06 నుంచి 19వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని అన్నిగ్రామాల విద్యాభిమానుల సహకారంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూన్ 06 నుంచి 19 వరకు ప్రతిరోజు నిర్వహించాల్సిన విద్యాసంబంధ కార్యక్రమాల గురించి ఎంఈఓ రాంధన్ వివరించారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు వారి పాఠశాలల్లో నిర్వహిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్ గురించి తెలిపారు. ఇన్‌చార్జ్ ధర్మప్రకాశ్ సమన్వయకర్తగా వ్యవహరించగా హెచ్ఎంలు మురళి, శ్రీనివాస్, నాగేశ్వరి, సునంద, శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



ఆత్మకూరు : ముగ్గుపోస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు : గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేట, నీరుకుళ్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, ముద్దం కృష్ణ, హంశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ గోపు రఘుపతిరెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని లబ్ధిదారులు మాదాసు స్వప్న, కట్కూరి రమాదేవి నూతనంగా నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు కమిటీ సభ్యులతో పాటు ఎంపీడీఓ, అధికారులు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు, అధికారుల సూచనలతో ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. నాలుగు విడుతలుగా రూ. 5లక్షలు బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపితే పంచాయతీ కార్యదర్శులు ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, గ్రామ కార్యదర్శి కిశోర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుమారస్వామి, మురళి, రహీంపాషా, భిక్షపతి పాల్గొన్నారు.

కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలు ఎటు వైపు..?

- తికమక పడుతున్న ప్రజలు



వేలేరు తహసీల్దార్ కార్యాలయం

వేలేరు : పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త మండలాలను, గ్రామాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 2016లో ఉమ్మడి ధర్మసాగర్ మండలంలోని 12 గ్రామాలు, భీమదేవరపల్లి మండలంలోని కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను కలుపుతూ 14 గ్రామాలతో వేలేరును నూతన మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నాటి నుంచి కన్నారం గ్రామాన్ని అక్కన్నపేట మండలంలో కలపాలని, ఎర్రబెల్లి గ్రామాన్ని భీమదేవరపల్లి మండలంలో కలపాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు, పాలకులకు వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. కానీ అది సాధ్యం కాలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ ఎర్రబెల్లిని భీమదేవరపల్లిలో, కన్నారంను అక్కన్నపేటలో కలుపుతానని హామీ ఇచ్చారు. దీని ప్రకారం ఆయా గ్రామాలను అక్కన్నపేట, భీమదేవరపల్లి మండలాల్లో కలపాలని జీఓ కూడా జారీ చేశారు. ఇచ్చిన జీఓ కూడా పూర్తిస్థాయిలో కాకుండా కొన్ని శాఖల వరకే పరిమితమవడంతో ప్రస్తుతం అన్ని శాఖల కార్యకలాపాలు వేలేరు నుంచే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పరంగా సంక్షేమ పథకాల కార్యకలాపాలు వేలేరు నుంచే జరుగుతున్నా.. కల్యాణలక్ష్మి చెక్కులు, ఇందిరమ్మ ఇళ్లు, వివిధ రకాల సర్వేలు, ఓటర్ నమోదు, ఇతరాత్ర పనులు భీమదేవరపల్లి నుంచి కొనసాగుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వేలేరుకు కాకుండా భీమదేవరపల్లి, అక్కన్నపేటలకు వెళ్తుండడం అక్కడి అధికారులు వేలేరు మండలానికే వెళ్లాలని చెప్పడంతో ఎక్కడ ఏ పని జరుగుతుందో తెలియక తికమక అవుతున్నారు. ఇప్పటికైనా రెండు గ్రామాలకు సంబంధించిన కార్యకలాపాలు ఒకే చోట నుంచే జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి



పోరుయాత్రలో పాల్గొన్న మహిళా సంఘాలు, జేఏసీ నాయకులు

ఎల్కతుర్తి : డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలని పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో భాగంగా గురువారం ఎల్కతుర్తి మండలంలోని కేశవాపూర్, తిమ్మాపూర్, ఆరేపల్లి, బావుపేట గ్రామాల్లో జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు గ్రామాల్లో డ్రగ్స్ వలన జరిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. డ్రగ్స్ వలన చిన్న వయస్సులోనే పలువురు తనువుచాలిస్తున్నారని, పోలీస్, నార్కోటిక్, ఎక్సైజ్ శాఖలు డ్రగ్స్‌ని అరికట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్ సారయ్య, ప్రకాశ్, పద్మ, వేముల జగదీశ్, ప్రభాకర్, చంద్రమౌళి, రవీందర్‌గౌడ్, భీమ్‌రాజ్, శంకర్, మంజుల, హైమావతి, దీపిక, వాణి ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

శాయంపేట : మండలంలోని సాధనపల్లి గ్రామంలో గురువారం ప్రారంభమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి పాల్గొన్నారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులు దేశ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.